సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం ׀ 7 ׀ జూలై ׀ 2023



ఢిల్లీకి చేరిన టెండర్ల లొల్లి..
ఎస్టీ హాస్టళ్లకు గుడ్లు, చికెన్ సరఫరా టెండర్ల వివాదం ఐటీడీఏ అధికారుల మెడకు చుట్టుకుంటోంది. 8లో



...ప్రైవేట్ డ్రైవర్ల సమ్మె
సింగరేణి భూ నిర్వాసితులు, ఎక్స్ ఎంప్లాయీస్ సన్స్ వెహికిల్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉన్నది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ(పెద్దమ్మ తల్లి) ఆలయంలో 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీ కుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, పాలకవర్గ సభ్యులతోపాటు వేద పడింతుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

9న శాకాంబరి అవతారంలో అమ్మవారు..

పెద్దమ్మతల్లి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా ఈ నెల 9న అమ్మవారు శాకాంబరి అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళం



దాతకు రశీదు ఇస్తున్న ఏఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్న దాన కార్యక్రమానికి యూఎస్ఏలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటున్న ముప్పాళ్ల యుగంధర్ రూ.5 లక్షల భారీ విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ మేరకు ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణకు విరాళం అందించగా ఆయన దాతకు రశీదు ఇచ్చారు. అనంతరం యుగంధర్ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీసీ అనిల్, ఆలయ పర్యవేక్షకులు చెమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల దరఖాస్తుల స్వీకరణ..



దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న వారు ఇంటిస్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించిన నేపథ్యంలో కలెక్టరేట్ ఇన్‌వార్డులో ప్రజలు దరఖాస్తులు అందజేస్తున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ, సుజాతనగర్ మండలం సీతంపేట, పాల్వంచ మండలం యానంబైల్ గ్రామాల వారు మాత్రమే దరఖాస్తులు అందజేయాలని, అక్కడ మాత్రమే ప్రభుత్వ భూమి ఉందని కలెక్టర్ ఇప్పటికే ప్రకటించారు. ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

తోగ్గూడెంలోని ఓ క్వారీలో బ్లాస్టింగ్ చేసేందుకు డ్రిల్లింగ్ చేస్తున్న కూలీలు



యథేచ్ఛగా పేల్చేస్తున్నారు

తోగ్గూడెం మైనింగ్‌లో ఇష్టారీతిన బ్లాస్టింగ్
- ఎక్కడా కనిపించని ఎక్స్‌ప్లోజివ్ నిపుణులు
- నిల్వలపైనా పారదర్శకత శూన్యం
- పరిమితికి మించి సామర్థ్యంతో క్వారీల్లో పేలుళ్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దీపావళి పండుగ మినహా మిగిలిన సందర్భాల్లో టపాసులు పేల్చాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి. ప్రభుత్వం రూపొందించిన నియమావళికి అనుగుణంగానే బాణసంచాను గోదాముల్లో నిల్వ చేయాలి. విక్రయించే దుకాణాలపై పోలీస్ నిఘా తప్పనిసరి. ఫైర్ సేఫ్టీ లేనిదే ఇక్కడ ఒక్క పనీ చేయడానికి వీల్లేదు. పెద్దగా ప్రమాదభరితం కాకున్నా టపాసుల నిల్వ, వ్యాపారం, కాల్చడం వంటి అంశాల్లో అనేక జాగ్రత్తలు పాటిస్తారు. ఇక కొండలను పిండి చేసే జిలెటిన్ స్టిక్స్, ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ వంటివి ఉపయోగించే క్వారీల్లో అడుగడుగునా జాగ్రత్తలు తీసుకుంటారనే భావన అందరిలోనూ ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

ఇష్టారీతినా పేలుడు పదార్థాల వినియోగం

జిల్లాలో నిర్మాణ రంగానికి అవసరమైన కంకరలో సింహభాగం పాల్వంచ మండలం తోగ్గూడెంలోని స్టోన్ క్రషర్ల నుంచే సరఫరా అవుతోంది. వీటికి అనుబంధంగా ఇక్కడ రాతి గుట్టలు, కొండలను పేలుడు పదార్థాలతో పేల్చేస్తుంటారు. పేలుళ్లతో కొండ రాళ్లు విరిగిపోయిన తర్వాత భారీ యంత్రాల సాయంతో వాటిని ముక్కలుగా చేస్తారు. ఆ తర్వాత లారీల్లో క్రషింగ్ యూనిట్లకు తరలిస్తారు. అక్కడ వివిధ సైజుల్లో రాళ్లను కట్ చేసి నిర్మాణ రంగంలో వివిధ అవసరాలకు ఉపయోగిస్తారు. ఇక్కడ క్వారీల నిర్వాహకులకు ప్రభుత్వం విధించిన నిబంధనలు అంటే లెక్కేలేదు. ఇప్పటికే మైనింగ్ కోసం లీజుకు తీసుకున్న స్థలానికి నాలుగింతల స్థలంలో మైనింగ్ చేపట్టారు. దీనికి సంబంధించి వందల కోట్ల రూపాయల జరిమానా విధించినా, ఇప్పటికీ ఒక్క పైసా కట్టకుండా దర్జాగా మైనింగ్ చేస్తున్నారు. ఆఖరికి లీజు గడువుతో కూడా తమకు సంబంధం లేదన్నట్టుగా అడ్డగోలుగా మైనింగ్ చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన అవినీతి, అక్రమాల్లో సహజ సంపద కొల్లగొట్టడం, ప్రభుత్వానికి పన్నులు ఎగవేయడం వంటివే ఉన్నాయి. ఎంత దోపిడీకీ పాల్పడ్డా, ఎన్ని అక్రమాలు చేసినా అడ్డుకునే వారు లేరనే ధైర్యంతో వీరి దందాలో మరో అడుగు ముందుకేశారు. క్వారీల్లో ఉపయోగించే పేలుడు పదార్థాల విషయంలోనూ ఇష్టారీతిగా వ్యవహరిస్తూ ప్రాణాంతక పరిస్థితులకు కారణమవుతున్నారు.

అనుమతి లేకుండానే బ్లాస్టింగ్..

జిల్లాలో తీవ్రవాద ప్రాబల్యం ఉండటంతో ఇక్కడ క్వారీల్లో బ్లాస్టింగ్‌లపై నిషేధం ఉంది. ఎవరైనా క్వారీల్లో బ్లాస్టింగ్ చేయాలంటే తగిన కారణాలు తెలుపుతూ కలెక్టర్ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ స్థానికంగా నెలకొన్న సున్నిత పరిస్థితుల నేపథ్యంలో జిల్లా అధికారులు సైతం ఎటువంటి బ్లాస్టింగ్‌లకు అనుమతి ఇవ్వడం లేదు. అయినప్పటికీ ఇక్కడి క్వారీలో పేలుడు పదార్థాల వినియోగం నిత్యకృత్యంగా మారింది. ఇప్పటికే అనేక నిబంధనలు గాలికొదిలేసిన క్వారీ యజమానులు కనీసం బ్లాస్టింగ్స్ జరిపేటప్పుడు, పేలుడు పదార్థాల నిర్వహణలోనూ కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు.

జాడ లేని నిపుణులు

నిపుణుల పర్యవేక్షణలోనే క్వారీల్లో పేలుడు జరపాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతీ క్వారీలో ఎక్స్‌ప్లోజివ్ ఎక్స్‌పర్ట్‌ను నియమించుకోవాలి. కానీ తోగ్గూడెంలో ప్రస్తుతం ఆరు క్వారీలు ఉండగా ఎక్కడా ఎక్స్‌ప్లోజివ్ ఎక్స్‌పర్ట్‌ల పర్యవేణలో పేలుడు జరగడం లేదు. కొన్ని క్వారీలు అసలు తమకు ఎక్స్‌పర్ట్‌లతో పని లేదన్నట్టుగా వ్యవహరిస్తుండగా, మరికొన్ని క్వారీల యజమానులు కాగితాలపై మాత్రమే ఎక్స్‌పర్ట్‌లు ఉన్నట్టుగా చూపిస్తున్నారు. వాస్తవంలో సమీప గ్రామ ప్రజలు, వలస కూలీలే పేలుళ్ల నిర్వహిస్తున్నారు. వీరికి ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేదు. కేవలం అనుభవంపై ఆధారపడి పేలుళ్ల జరుపుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయినా, తీవ్రంగా గాయపడినా విషయం బయటకు పొక్కకుండా క్వారీల యాజమాన్యాలు తృణమో పణమో ముట్టజెప్పి బాధితుల నోళ్ల మూయిస్తున్నాయి.

భారీ పేలుళ్లు..

తోగ్గూడెం క్వారీలో బ్లాస్టింగ్ డ్రిల్స్ వేయడానికి ఏకంగా రిగ్గులనే ఉపయోగిస్తున్నారు. వ్యవసాయ బోర్లు వేసే లారీలను క్వారీలకు తీసుకొచ్చి అక్కడ కొండలకు లోతైన రంధ్రాలు చేస్తున్నారు. ఆ తర్వాత శక్తిమంతమైన బాంబులతో పేలుస్తున్నారు. ఈ సమయంలో కనీసం హెచ్చరికలు కూడా జారీ చేయడం లేదు. పేలుడు తీవ్రతకు కొన్నిసార్లు బండ రాళ్లు క్వారీలకు చుట్టుపక్కల పొలాల్లోనూ పడుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లోనూ విషయం బయటకు రాకుండా ప్రైవేట్ సెటిల్‌మెంట్లతో పని కానిచ్చేస్తున్నారు.

లెక్కాపత్రం లేదు

క్వారీల్లో ఉపయోగించే పేలుడు పదార్థాల నిర్వహణ అంత్యంత కీలకమైన అంశం. ఇవి ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు.? నిల్వ చేసేటప్పుడు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? ఏ రోజు ఎంత పేలుడు పదార్థాలను వినియోగించారు.? ఇంకా నిల్వ ఎంత? డిస్పోజ్ చేసింది ఎంత? ఇలా అన్ని విషయాల్లో పారదర్శకత పాటించాలి. రికార్డులు సక్రమంగా నిర్వహించాలి. పేలుడు పదార్థాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలి. పోలీసులు సైతం ఆకస్మిక తనిఖీలు చేస్తూ పొరపాట్లు జరగకుండా చూడాలి. కానీ క్వారీల్లో పేలుళ్లను చూసీచూడనట్టుగా వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇక్కడ బ్లాస్టింగ్ విషయంలో లెక్కాపత్రం లేకుండా పోయిందనే ఆరోపణలు ఉన్నాయి.

అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేస్తే చర్యలు



తోగ్గూడెంలోని క్వారీల్లో అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను వినియోగించి బ్లాస్టింగ్ చేస్తే చర్యలు తీసుకుంటాం. క్వారీలో బండరాళ్లను పగులగొట్టేందుకు నిర్వాహకులు అనుమతులు పొందాలి. బ్లాస్టింగ్ చేసేవాళ్లకు అనుమతులు ఉండాలి. నేను ఇటీవలనే బాధ్యతలు తీసుకున్నాను. తోగ్గూడెంలోని క్వారీల్లో ఎవరెవరికి అనుమతులున్నాయనే విషయమే ఆరా తీస్తున్నాను.

-వి.వినయ్‌కుమార్, పాల్వంచ సీఐ

ఒక్కడికీ పట్టా ఇవ్వను!



కారు ఎక్కుతున్న ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

- ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆగ్రహం
- పోడు హక్కు పత్రాలు రాని గిరిజనుల ఆందోళన
- గాండ్లగూడెంలో రసాభాసగా పట్టాల పంపిణీ



ఎమ్మెల్యేను నిలదీసిన వారితో అధికార పార్టీ కార్యకర్తల వాగ్వాదం

అశ్వారావుపేటరూరల్: పోడు పట్టాల పంపిణీ రసాభాసగా మారింది. తమకు పోడు పట్టాలు రాలేదని కొందరు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును నిలదీశారు. దీంతో ఆగ్రహం చెందిన ఎమ్మెల్యే ఒక్కడికీ పోటు పట్టా ఇవ్వనంటూ హెచ్చరించారు. ఈ ఘటన అశ్వారావుపేట మండలం గాండ్లగూడెంలో గురువారం జరిగింది. మండలంలోని మల్లాయిగూడెం పంచాయతీ దిబ్బగూడెం, అనంతారం, గాండ్లగూడెం, నారాయణపురం పంచాయతీ నెమలిపేట, వినాయకపురం గ్రామాల్లో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతుల మీదుగా గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గాండ్లగూడెం పంచాయతీలో వేదికపై మాట్లాడేందుకు ఎమ్మెల్యే సిద్ధమవుతుండగా కొందరు గిరిజనులు చుట్టుముట్టి తమకు పోడు పట్టాలు రాలేదని నిలదీశారు. తమకు వచ్చిన పోడు పట్టా ఇవ్వాలంటే ఎకరానికి రూ.5 వేల చొప్పున పంచాయతీ గుమస్తా డిమాండ్ చేస్తున్నట్లు మరికొందరు వచ్చి ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగి తోపులాట చోటుచేసుకున్నది. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో కంగుతిన్న ఎమ్మెల్యే అక్కడే ఉన్న ఏఎస్సై రెహమాన్‌ను పిలిచి గొడవ జరుగుతుంటే ఏం చూస్తున్నావ్.. ఆందోళన చేసే వాళ్లందరినీ బయటకు పంపాలని ఆదేశించారు. ఆందోళనకారులను పోలీసులు అదుపు చేసి బయటకు తీసుకెళ్లడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం పోడు పట్టాల పంపిణీ పూర్తైన తర్వాత ఎమ్మెల్యేను నిలదీసిన వారితో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గొడవకు దిగారు.

గొడవ చేస్తే.. ఇక అంతే..

పోడు పట్టాల పంపిణీ కార్యక్రమంలో గొడవ చేస్తే ఒక్కడికీ పోడు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వనని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హెచ్చరించారు. గాండ్లగూడెంలో 971 ఎకరాలకు సంబంధించి 266 మందికి పోడు పట్టాలు ఇస్తున్నామని, ఒకరిద్దరికి రాకపోవచ్చని అన్నారు. రాని వాళ్లు మళ్లీ దరఖాస్తు పెట్టుకుంటే పరిశీలించి మంజూరు చేయిస్తానని తెలిపారు. ఎన్నో ఏళ్ల పోరాటాలు చేసి, కేసులు పెట్టించుకున్నారని, తీరా పట్టాలు ఇస్తుంటే కొందరు వెనుక ఉండి రాజకీయాలు చేస్తూ వివాదాలకు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి గొడవలకు, రాజకీయాలకు తాను భయపడే వ్యక్తిని కాదని అన్నారు. గొడవ చేసినందుకు పట్టాలన్నీ వెనక్కి తీసుకెళ్లి పోదామని నిర్ణయించుకున్నానని, కానీ మహిళల ముఖం చూసి పోడు పట్టాలు ఇస్తున్నానని చెప్పారు. అనంతరం పట్టాలు పంపిణీ చేశారు.

ఇంటర్ సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్

- ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు వెల్లడి

భద్రాచలం: 2023 - 24 విద్యా సంవత్సరానికిగాను భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 10, 11 తేదీల్లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022 - 23లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 10న ఉదయం 9 గంటలకు బాలికలు, 11న ఉదయం 9 గంటలకు బాలురు ఐటీడీఏలోని గిరిజన భవనం వద్దకు హాజరు కావాలని సూచించారు.

కమనీయం.. రామయ్య కల్యాణం

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో గురువారం రామయ్య నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

శాస్త్రీయ అవగాహన పెంపొందించాలి



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించాలని జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు సూచించారు. గురువారం కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి సైన్స్, గణితం ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్, ఇంటింటా ఇన్నోవేషన్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సామాజిక సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌లో పాల్గొన్న విద్యార్థులకు ఐఐటీలో రెండు శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఆగస్టు నెలాఖరులోగా ఇన్‌స్పైర్ ఆఫ్ లోడింగ్ పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా ఇన్నోవేషన్‌లో అందరూ పాల్గొనే అవకాశం ఉందని, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలు ఎవరైన నూతన ఆలోచనలతో ప్రాజెక్టులు రూపొందించుకోవచ్చన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలకు ఈ ఏడాది లక్ష రూపాయల బహుమతులు ప్రకటించారని తెలిపారు. ఎన్‌సీఎస్‌సీ కో ఆర్డినేటర్ బి.సంపత్‌కుమార్, రిసోర్స్ పర్సన్‌లు జి.చంద్రశేఖర్, ఎస్.రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల సాగు అంతంతే...



గుండాల మండలంలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

- గత నెలంతా వర్షాల కోసం ఎదురుచూపులే..
- ఈ నెలలో ఇప్పటికైతే ఆశాజనకంగా వానలు
- ఈసారి నెల ఆలస్యంగా వానాకాలం సీజన్
- ఇప్పటివరకు 14.84 శాతమే పంటల సాగు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నెల ముందు ప్రారంభించాలనుకున్న వానాకాలం వ్యవసాయ సీజన్ అనావృష్టి కారణంగా నెల ఆలస్యంగా ప్రారంభమైంది. రైతులు భయభయంగానే సాగు పనులు చేపడుతున్నారు. లోటు వర్షపాతం ఉన్నప్పటికీ సీజన్ సాధారణ విస్తీర్ణంలో ఇప్పటివరకు 14.84 శాతమే పంటలను వేశారు. పత్తి, జీలుగు, మొక్కజొన్న, పిల్లిపెసర, జనుము విత్తనాలు వేయడంతోపాటు వరినారు పోశారు. వానాకాలం సాధారణ పంట విస్తీర్ణం అంచనా 5,77,409 ఎకరాలు కాగా వర్షాభావ పరిస్థితుల వల్ల కేవలం 85,671 ఎకరాల్లో మాత్రమే సాగు చేపట్టారు. పంటలు వేయకపోవడంతో సాగు భూములు బోసిపోతున్నాయి. జూన్ మాసంలో జిల్లాలో -50 శాతం లోటువర్షపాతం నమోదైంది. తొలకరి తర్వాత వరుణుడు జాడ లేకపోవడంతో దిగులు పడ్డ రైతుల్లో.. మూడు రోజుల నుంచి గురువారం రాత్రి వరకు కురిసిన ఓ మోస్తరు వర్షాలు ఆశలు చిగురింపజేస్తున్నాయి.

40,892 ఎకరాల్లో పత్తి

జిల్లాలో ఇప్పటివరకు పత్తి 40,892 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న 4,953 ఎకరాలు, జీలుగు 31,910 ఎకరాలు, పిల్లిపెసర 1,103 ఎకరాలు, జనుము 1,407 ఎకరాలు, వెదజల్లే పద్ధతిలో వరి 349 ఎకరాల్లో సాగు చేశారు. ఎకరాలకు 5,047 వరినారు పోశారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ పనులు క్రమేపీ ఊపందుకుంటున్నాయి. ఈ నెలలో జిల్లాలో ఇప్పటివరకు 1,950 మి.మీ వర్షపాతం, సరాసరి వర్షపాతం 84.78 మి.మీ నమోదైంది. అధికంగా టేకులపల్లి మండలంలో 122 మి.మీ వర్షపాతం నమోదుకాగా, మండలంలో 20,593 ఎకరాల్లో పంటల సాగు చేపట్టారు. కాగా జిల్లాలో సాగైన మొత్తం విస్తీర్ణంలో పత్తి పంటే 50శాతం వరకు ఉంది.

మండలాల వారీగా వర్షపాతం, పంట విస్తీర్ణం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ.)	పంట విస్తీర్ణం (ఎకరాల్లో)
అన్నపురెడ్డిపల్లి	58.6	5,339
అశ్వారావుపేట	90.8	2,063
చండ్రుగొండ	79.4	4,019
దమ్మపేట	59.4	4,889
ములకలపల్లి	110	3,633
భద్రాచలం	79.6	1
చర్ల	91.8	1,243
దుమ్ముగూడెం	147.2	3,555
చుంచుపల్లి	114.4	991
జూలూరుపాడు	59	5,954
కొత్తగూడెం	111	97
లక్ష్మీదేవిపల్లి	81.8	815
పాల్వంచ	71.4	2,642
సుజాతనగర్	124.4	9,847
ఆళ్లపల్లి	90.4	3,011
బూర్గంపాడు	116.4	7,240
గుండాల	69.2	718
కరకగూడెం	39.2	853
మణుగూరు	51	959
పినపాక	49.2	907
టేకులపల్లి	122	20,593
ఇల్లెందు	86.8	5,530
మొత్తం	1,950	85,671

మొదటి నుంచే కష్టాలు..



వానాకాలం మొదటి నుంచే మాకు కష్టాలు ప్రారంభమయ్యాయి. జూన్‌లో కళ్లు కాయలు కాసేలా వర్షాల కోసం ఎదురు చూశాం. ఈనెలలో పరవాలేదనిపిస్తోంది. వ్యవసాయ పనులైతే ప్రారంభించాం. వర్షాలు ఏమి చేస్తాయో అని భయంగానే ఉంది.

-కల్తీ ముత్తయ్య, కన్నాయిగూడెం, గుండాల మండలం

పనులు ముమ్మరం..



ఈ నెల ప్రారంభంలోనే వర్షాలు కొంత ఆశాజనకంగా ఉండటంతో జిల్లాలో వ్యసాయ పనులను రైతులు ముమ్మరం చేశారు. విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలి. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

-కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

గణాంకదర్శిని పుస్తకావిష్కరణ



గణాంకదర్శిని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్, ఇతర అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా గణాంకదర్శిని పుస్తకాన్ని కలెక్టర్ అనుదీప్ గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక ప్రణాళిక విధాన రూపకల్పనలో గణాంకాలు ఎంతో ముఖ్యమని అన్నారు. గణాంకాల సేకరణలో ప్రణాళికశాఖ ముఖ్యపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గణాంకదర్శినిలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, నీటివనరులు, వ్యవసాయం, విద్య, కుటుంబ సంక్షేమం, రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, సోషల్ సెక్యూరిటీ తదితర వివరాలు ఉంటాయని తెలిపారు. అధికారులు శ్రీనివాసరావు, సంజీవరావు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న జమేదార్, ఆఫీస్ సబార్డినేట్లు, డ్రైవర్లు తదితరులకు గురువారం కలెక్టర్ అనుదీప్ చేతుల మీదుగా యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, ఏఓ గన్యా, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీరా రాంరవి, ఉపాధ్యక్షులు జి.నరసింహారావు, కోశాధికారి ఎస్.చిన వెంకటేశ్వర్లు, తాజుద్దీన్, గౌతమ్, శివ, యాకూబ్, లాలయ్య, వై నరసింహారావు, ఉదయ్‌కుమార్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇంటింటా ఇన్నోవేటర్‌కు ఆవిష్కర్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ గురువారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆగస్టు 5వ తేదీలోగా తమ వివరాలను పంపించాలని సూచించారు. ప్రజల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని రంగాల, వర్గాల నుంచి ఆవిష్కరణలను కోరుతున్నట్లు తెలిపారు. గ్రామీణ, విద్యార్థుల, వ్యవసాయ, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు తదితర ఆవిష్కరణలు పంపాలని కలెక్టర్ తెలిపారు. ఆవిష్కర్తలు తమ ఆవిష్కరణకు సంబంధించి 6 వాక్యాలు, 2 నిమిషాల వీడియోను, ఆవిష్కరణకు సంబంధించి 4 ఫొటోలు, ఆవిష్కర్త పేరు, ఫోన్ నంబరు, వయసు, ప్రస్తుత వృత్తి, గ్రామం, జిల్లాపేరు తదితర వివరాలను 91006 78543 సెల్ నంబరుకు వాట్సాప్ చేయాలని సూచించారు. వచ్చిన దరఖాస్తుల్లో 5 ఆవిష్కరణలు ఎంపిక చేసి ప్రదర్శిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

'ఆరోగ్య శ్రీ' బృందం ఆరా

సాక్షి ఎఫెక్ట్..

సుజాతనగర్: ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన రాఘవాపురం గ్రామానికి చెందిన గంధం జంపయ్య ఆరోగ్య పరిస్థితులపై కొత్తగూడెం డివిజన్ ఆరోగ్య శ్రీ టీం సభ్యులు గురువారం ఆరా తీశారు. జంపయ్య ఆర్థిక పరిస్థితి సరిగా లేక వైద్యం చేయించుకోకపోవడంపై 'ఆపన్న హస్తం అందించరూ'అంటూ గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కమల్‌చంద్‌నాయక్, జిల్లా మేనేజర్ డా.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు టీం సభ్యులు జంపయ్యను పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు వారు తెలిపారు.

మెరిట్ జాబితా విడుదల

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ల పోస్టులకు సంబంధించి మెరిట్ జాబితా విడుదల చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జెవీఎల్.శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాను జిల్లా వెబ్‌సైట్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచామని పేర్కొన్నారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరిశీలన చేసుకోవాలని సూచించారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన పాయం, తెల్లం



డీసీసీ అధ్యక్షుడిని సత్కరిస్తున్న పాయం, తెల్లం, తదితరులు

భద్రాచలం: జిల్లా డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యను మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇటీవల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న భద్రాచలం నాయకుడు డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌లు గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడిని శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు పొదెం వీరయ్య ఆధ్వర్యాన కలిసి నడుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, నాయకులు బోగాల శ్రీనివాసరెడ్డి, బలుసు నాగ సతీష్, బంధం శ్రీనివాస్‌గౌడ్, సరెళ్ల వెంకటేష్, సుబ్బారావు, తరుణ్‌మిత్ర, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

అశ్వారావుపేటరూరల్: అదుపుతప్పి ఓ లారీ బోల్తా పడిన ఘటన గురువారం మండలంలో జరిగింది. భద్రాచలం వైపు నుంచి ఏపీలోని రాజమండ్రికి వెళ్తున్న కంటైనర్ లారీ అశ్వారావుపేట మండలం నందిపాడు వద్ద అదుపు తప్పి బోల్తా పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడగా, లారీ ధ్వంసమైంది.

విద్యార్థిని అదృశ్యం

చింతకాని: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని అదృశ్యం కావడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు విద్యార్థిని ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్సై పొదిల వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోటితండాలో విషాదం

పోట్లాడుకుంటున్న ఎద్దులు మీదపడడంతో రైతు మృతి



బిక్కు (ఫైల్)

కారేపల్లి: ఎద్దులు పోట్లాడుకుంటూ.. రైతు మీద వచ్చి పడడంతో రైతుకు తీవ్ర గాయాలై మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బోటితండా గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బానోత్ బిక్కు(45) తనకున్న నాలుగెకరాల్లో పత్తి, మిర్చి పంట వేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, బుధవారం సాయంత్రం చేను పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో రోడ్డుపై ఎద్దులు పోట్లాడుకుంటున్నాయి. దీంతో రోడ్డుపక్కకు తన ద్విచక్రవాహనాన్ని ఆపగా.. ఎద్దులు పోట్లాడుకుంటూ వచ్చి ఒక్కసారిగా మీదపడి బిక్కు పొట్ట, మెడ భాగాల్లో తొక్కడంతో తీవ్రగాయాలపాలైయ్యాడు. గమనించిన స్థానికులు బిక్కును ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా.. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో..కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. అందరితో కలుగొలుపుగా ఉండే బిక్కు మృతి చెందటంతో బోటితండా గ్రామంలో విషాదం నిండుకుంది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

ఢిల్లీకి చేరిన టెండర్ల లొల్లి..

- అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గిరిజనుడి డిమాండ్
- జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదుకు సిద్ధం
- ఇప్పటికే రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, కమిషనర్‌కు ఫిర్యాదు



హైదరాబాద్‌లో అడిషనల్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న గిరిజన సంఘం నాయకులు(ఫైల్)

భద్రాచలం: జిల్లాలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో గుడ్లు, చికెన్, ఇతర వంట సామగ్రిల రవాణాకు చేపట్టిన టెండర్లు ఐటీడీఏ అధికారుల మెడకు చుట్టుకుంటున్నాయి. ఈ టెండర్లను నియమ నిబంధనలకు వ్యతిరేకంగా అధికారులు గిరిజనేతరులకు కట్టబెట్టడంపై గిరిజన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై 'సాక్షి'లో గత నెల 17న 'ఐటీడీఏలో గోల్‌మాల్..?'అనే కథనం ప్రచురితమైంది. గిరిజన సంఘాల నాయకులు సాక్షి కథనాలు, వారి వద్ద ఉన్న ఆధారాలతో గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి, కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు.

జాతీయ ఎస్టీ కమీషన్‌కు ఫిర్యాదుకై రంగం సిద్ధం

ప్రధానంగా పాల్వంచ మండలంలో టెండర్‌ను పొందడానికి అన్ని అర్హతలున్న గిరిజనుడిని కాదని రూ.10 తక్కువ కోట్ చేశారనే కారణంతో ఎటువంటి అర్హతలు లేని గిరిజనేతరుడికి అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గిరిజనేతరుడికి గిరిజన సంక్షేమ శాఖ అధికారులు విడుదల చేసిన అన్ని నియమనిబంధనలకు అర్హుడా కాదా అని ఐటీడీఏ అధికారులు ధ్రువీకరించి టెండర్‌ను ఖరారు చేయాలి. కానీ సదరు కాంట్రాక్టర్ దుకాణానికి సంబంధించి ఎటువంటి పత్రాలు, ఆదాయ, జీఎస్టీ రిటర్న్స్ లేకపోయినా.. టెండర్‌ను అధికారులు అప్పగించారని పేర్కొంటూ గిరిజన సంఘాల నాయకులు, టెండర్‌లో పాల్గొన్న గిరిజనులు ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రుకు ఫిర్యాదు చేశారు. ఈ టెండర్‌లో ఐటీడీఏకు చెందిన ఓ కీలక అధికారి, పాల్వంచ మండలానికి చెందిన ఏటీడబ్ల్యూల పాత్ర ఉందంటూ సదరు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిష్టినా జెడ్ చొంగ్తూ, అడిషనల్ అధికారి సర్వేష్ రెడ్డి, మహబూబాబాద్‌లో గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, తాజాగా టెండర్‌లో పాల్గొన్న గిరిజనుడు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. గిరిజనేతరుల ముందు ఐటీడీఏలోని టెండర్‌ల సమయంలో గిరిజనుడిగా సంబోధిస్తూ అవమానపర్చారని, అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలనే ఆరోపణలతో సదరు గిరిజనుడు ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నారు.

అధికారుల వితండవాదం..

కాగా సదరు టెండర్‌ల కేటాయింపుపై ఐటీడీఏ అధికారులు పొంతన లేని సమాధానాలను ఇస్తుండడం గమనార్హం. తక్కువ కోట్ చేసినందుకు గిరిజనేతరుడికి కేటాయించామని పేర్కొంటూ, అన్ని అర్హతలు ఉన్నాయా లేదా అని క్షేత్రస్థాయిలో పరిశీలించే బాధ్యత తమది కాదని, ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే పరిశీలిస్తామని పొంతన లేని సమాధానాలు ఇస్తుండడం గమనార్హం. ముందస్తుగా పరిశీలన చేసి పాలనలో పారదర్శకంగా నిలావాల్సిన ఐటీడీఏ అధికారులే, ఇలా గిరిజన బాలబాలికలకు నష్టం వాటిల్లే విధంగా నిర్ణయాలు తీసుకోవడం విడ్డూరంగా ఉందంటూ గిరిజన సంఘాలు ముక్కున వేలేసుకుంటున్నాయి. కాగా, ఈ వివాదంపై ఐటీడీఏకు చెందిన ఓ కీలక అధికారిని రాష్ట్ర గిరిజన సంక్షేమ అధికారులు హైదరాబాద్‌కు పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా సమాచారం. ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం చేపట్టే పథకాలు, గిరిజన విద్యార్థులకు కల్పిస్తున్న వసతుల కల్పన, విధుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదంటూ సుద్దులు తెలిపినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ అధికారులు, ఐటీడీఏ పీఓ దీనిపై సమగ్ర విచారణ జరిపి అవకతవకలకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకొని అర్హతలు ఉన్న గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గిరిజన విద్యాభివృద్ధికి సీఆర్టీల సర్దుబాటు

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్

భద్రాచలం: గిరిజన విద్య కుంటుపడకుండా రెగ్యులర్ ఉపాధ్యాయుల లేనిచోట సీఆర్టీలను సర్దుబాటు చేసినట్లు ఐటీడీఏ ఏపీఓ జనరల్, ఇన్‌చార్జ్ గురుకుల ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ తెలిపారు. స్థానిక పీఎంఆర్‌సీ భవనంలో సీఆర్టీ యూనియన్ సభ్యుల సమక్షంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సబ్జెక్టుల వారీగా సీనియార్టీని పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా కౌన్సెలింగ్ చేశామన్నారు. బాలికల పాఠశాలలకు మహిళా సీఆర్టీలను, బాలుర పాఠశాలలకు పురుషులను తీసుకున్నామని చెప్పారు. ప్రధానంగా గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులకు ప్రాధాన్యతాపరంగా నియమించినట్లు వెల్లడించారు. కౌన్సిలింగ్ ద్వారా ఎంపికైన సీఆర్టీలు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, భద్రాచలం, ఇల్లెందు, దమ్మపేట ఏటీడీఓలు నరసింహారావు, రూపాదేవి, చంద్రమోహన్, జీసీడీఓ అలివేలు మంగతాయారు, సిబ్బంది రంగయ్య, నారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డేవిడ్‌రాజ్

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల టెండర్లు ఖరారు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాల, ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన స్థానికంగా ఉన్న సిబ్బందిని ఎంపిక చేసేందుకు అవసరమైన ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను టెండర్ల ప్రకారం ఎంపిక చేశామని డేవిడ్‌రాజ్ తెలిపారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉపాధి కల్పన శాఖాధికారి విజేతతో కలిసి టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. ఐదు ఏజెన్సీలు ఈ టెండర్‌లో పాల్గొనగా తక్కువ కోట్ చేసిన వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణసాగర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ హరిసింగ్, భద్రాచలం ప్రిన్సిపాల్ దేవదాస్ పాల్గొన్నారు.

పట్టాల పేరుతో అక్రమ వసూళ్లు

- పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి
- సమగ్ర విచారణతో మరిన్ని అక్రమాలు బట్టబయలు

ఇల్లెందురూరల్: అర్హులైన ప్రతీ రైతుకు పోడు పట్టాలిస్తామని ప్రభుత్వం ప్రకటించిన మొదలు అక్రమాలకు అంకురార్పణ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దరఖాస్తు మొదలు, క్షేత్రస్థాయి పరిశీలన, సర్వే తదితర ఘట్టాలలో అభ్యంతరాలను తామే చూసుకుంటామని కొందరు దళారులు నాడే అక్రమ వసూళ్లకు పాల్పడినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేకాకుండా అటవీశాఖ అధికారులు సైతం ఒక్కో రైతు నుంచి రూ.వెయ్యి నుంచి రూ.1,500 వసూలు చేసినట్లుగా నాడు రైతులు బహిరంగంగానే ఆరోపించారు. ఇదిలా ఉండగా.. గ్రామ పంచాయతీ, మండల, డివిజన్, జిల్లా కమిటీల ద్వారా పరిశీనలు పూర్తి చేసుకొని తాజాగా ప్రభుత్వం పోడు పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అయితే గతంలో పట్టాలు ఇప్పిస్తామని కొంతమంది తమ వద్ద డబ్బులు వసూలు చేశారని ఆరోపిస్తూ మండలంలోని రొంపేడు గ్రామానికి చెందిన రైతులు బుధవారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు. కాగా గతంలో అటవీభూములకు కూడా రెవెన్యూ పట్టాలిప్పిస్తామని డబ్బులు దండుకున్న దళారులు నకిలీపట్టాలు ఇచ్చారని పలువురు రైతులు తాము స్వీకరించిన పట్టాదారు పాస్‌పుస్తకాలను చూపిస్తున్నారు. నేడు అవే భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు రావడంతో గతంలో దళారులు తమకు ఇచ్చినవి నకిలీవిగా నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్క రొంపేడు గ్రామమే కాకుండా మరికొన్ని గ్రామాల్లోనూ ఇదే తరహాలో వసూళ్లు ముమ్మరంగా జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. రొంపేడు రైతుల నుంచి అందిన ఫిర్యాదుపై పోలీసులు సమగ్రంగా విచారణ నిర్వహిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అమ్మో.. దొంగలు!

కొనసాగుతున్న వాహనాల చోరీల పరంపర

- కనిపించకుండాపోతున్న మోటార్ సైకిళ్లు, ఆటోలు
- సరిహద్దు ప్రాంతాల్లో తక్కువ ధరలకు అమ్మకం..
- పోలీసుల వలలో ఓ ముఠా?
- బహిర్గతం చేయని చోరీ వ్యక్తుల వివరాలు



అదుపులో పాత పాల్వంచ యువకుడు?

పాల్వంచ: సరిహద్దు రాష్ట్రాల నడుమ చోరీల పరంపర కొనసాగుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా నిత్యం మోటార్ సైకిళ్లు, ఆటోలు తదితర వాహనాలు చోరీలకు గురవుతున్నాయి. ముఖ్యంగా భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో ఇటీవల వాహనాలు మాయంకావడం నిత్యకృత్యంగా మారింది. చోరీలకు గురవుతున్న కొన్ని సంఘటలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమవుతున్నా.. అలాంటి చోరీ వ్యక్తుల విషయాలు మాత్రం బహిర్గతం కావడం లేదు. కాగా ఓ ముఠా తెలంగాణ ప్రాంతంలో చోరీ చేసి ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు ప్రాంతాల్లో తక్కువరేట్లకు అమ్మకాలు చేపడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. పాత పాల్వంచకు చెందిన ఓ యువకుడు రెండు ఆటోలను చోరీ చేసి ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులో అమ్మగా.. వాటిని స్థానికులే అనుమానంతో వెళ్లి పట్టుకొచ్చారు. అనంతరం చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులకు అప్పగించారు. ఒక ఆటోను వాజేడు వద్ద భూపాల్‌పట్నం, మరో ఆటోను ఎటపాక నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఓ గ్రామంలో ఉంచిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలో ఓ ముఠా భారీ ఎత్తున వాహనాలు అమ్మేందుకు ఉంచిన మోటార్ సైకిళ్ల జాడ సైతం పోలీసుల చెంత ఉండడం గమనార్హం. ఈ విషయమై ఎస్‌ఐ నరేశ్‌ను వివరణ కోరగా అలాంటిదేమీ లేదని అన్నారు.

పోలీసులకు సవాల్..

వారం రోజుల వ్యవధిలో అంబేడ్కర్ సెంటర్‌లోని ఓ క్లాత్ స్టోర్ సమీపంలో ప్యాషన్ ప్రొ మోటార్ సైకిల్ చోరీకి గురైంది. ఆ మరుసటి రోజే నటరాజ్ సెంటర్‌లోని ఓ రెస్టారెంట్ వద్ద యూనికార్న్ మోటార్ సైకిల్, అదేవిధంగా ఓ హోటల్ ముందు మరో మోటార్ సైకిల్ చోరీకి గురైంది. నవభారత్ ఏరియాలోని మంచికంటి నగర్‌లో ఇంటి ముందు నిలిపిన ఆటో చోరీ అవడంతో ఆటోల చోరీల సంఖ్య నాలుగుకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇక బస్టాండ్, సీ కాలనీ వద్ద అనేక వాహనాలు చోరీకి గురయ్యాయి. ఈ చోరీ పరంపర పోలీసులకు సవాల్‌గా మారాయి. ఇలా లెక్కకు మించి చోరీలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. కొందరు వాహనాలు పోతే ఫిర్యాదులు చేస్తుండగా.. మరికొందరు వదిలేస్తున్నారు.

ఆపరేషన్ ముస్కాన్ టీం సోదాలు

ఇల్లెందు: పట్టణంలో ఆపరేషన్ ముస్కాన్ టీం పలు చోట్ల సోదాలు చేసింది. ఈక్రమంలో గురువారం పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ఏరియాలో సోదాలు చేయగా.. హరి మెకానిక్ షాపులో పదహారేళ్ల బాలుడు నాగరాజుకు రోజుకు రూ.150 చెల్లిస్తానని చెప్పి మెకానిక్ హరికిషన్ పనిలో పెట్టుకున్నాడు. దీంతో నాగరాజు తల్లి శివకుమారి ఫిర్యాదు మేరకు హరికిషన్‌పై కేసు నమోదు చేసినట్లు టీం సభ్యులు ఏఎస్‌ఐ ఘనీ తెలిపారు.

పాత కక్షలతో ఒకరిపై దాడి..

పట్టణంలో పాత కక్షలు ప్రజ్వరిల్లుతున్నాయి. తాజాగా కొత్త కాలనీకి చెందిన ఎం.జయప్రకాష్ కుమారుడు నవీన్‌రాజ్ మీద పట్టణానికి చెందిన హుస్సేన్, యాకూబ్, మహేష్, అఖిల్, శివరాం తదితరులు దాడి చేశారంటూ జయప్రకాష్ ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో.. 32 నాటుకోళ్లు మృతి

ఇల్లెందురూరల్: కుక్కల దాడిలో 32 నాటుకోళ్లు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మండలంలోని బోయితండా గ్రామపంచాయతీ లక్ష్మీనారాయణతండా గ్రామానికి చెందిన భూక్య చంద్రు గ్రామ శివారులో షెడ్డు ఏర్పాటు చేసుకొని నాటుకోళ్లు పెంచుతున్నాడు. సాయంత్రం భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లిన సమయాన కుక్కలు షెడ్డులోకి ప్రవేశించి 32 కోళ్లను హతమార్చాయి. మరో 10 కోళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో చంద్రుకు సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.



మృతిచెందిన నాటు కోళ్లు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట అటవీ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని బట్టీలగుంపు గ్రామానికి చెందిన సోడే ప్రభాకర్ బైక్‌పై మొండికుంట వైపు వస్తున్నాడు. ఈక్రమంలో మొండికుంట అటవీ ప్రాంతంలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో అతడికి గాయాలయ్యాయి. పోలీస్ వాహనంలో ప్రభాకర్‌ను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కొండముచ్చులు అడ్డొచ్చి.. బోల్తాకొట్టిన ఆటో

నలుగురు విద్యార్థులకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: రోడ్డు దాటుతున్న కొండముచ్చులు అడ్డు రావడంతో విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా కొట్టింది. వివరాలిలా ఉన్నాయి. రామాంజనేయ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ నర్సింహ అదే కాలనీకి చెందిన పది మంది విద్యార్థులను ఆటోలో ఎక్కించుకుని గురువారం ఉదయం బయలుదేరాడు. ఈ క్రమంలో పట్టణ పరిధిలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట కొండముచ్చులు రోడ్డు దాటుతుండగా.. ప్రమాదవశాత్తు కొండముచ్చలను ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలోని నలుగురు విద్యార్థులకు గాయాలు కావడంతో స్థానికులు కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ అబ్దుల్ రహమాన్, వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆటో బోల్తా పడిన సమయాన ఎటువంటి భారీ వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

15 రోజులు మృత్యువుతో పోరాడి.. ఓడి..

రోడ్డు ప్రమాదంలో గాయపడి.. చికిత్స పొందుతూ యువతి మృతి

బూర్గంపాడు: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై పదిహేను రోజుల పాటు చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడిన ఓ యువతి చివరకు తనువు చాలించింది. ఈ విషాదకర సంఘటన మండలంలోని లక్ష్మీపురంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీపురం గ్రామానికి చెందిన తాళ్లూరి నాగేశ్వరరావు, నాగమణి దంపతుల కుమార్తె రమ్యశ్రీ(22) గత నెల 20న బ్యాంకు పనుల నిమిత్తం తమ బంధువు రామ్మోహన్‌తో కలసి రమ్యశ్రీ మోటార్ సైకిల్‌పై సారపాకకు వచ్చింది. ఈ క్రమంలోనే బ్యాంకు సమీపంలో ఎదురుగా వచ్చిన కారు వీరి వాహనాన్ని వేగంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రమ్యశ్రీని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో 15రోజుల పాటు మృత్యువుతో పోరాడి బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, డిగ్రీ వరకు చదువుకున్న ఆమె హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుంది. రెండేళ్ల క్రితం ఆమె అన్న సాయిప్రకాశ్ సూసైడ్ చేసుకున్నాడు. తల్లిదండ్రులు రమ్యశ్రీపైనే ఆశలు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు రమ్యశ్రీని రోడ్డు ప్రమాదం పొట్టన పెట్టుకోవటంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ఖమ్మంక్రైం: ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఖమ్మంలో చోటు చేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌కు చెందిన వేముల మట్టయ్య కూతురు లక్ష్మికి ఖమ్మంలోని త్రీటౌన్ ప్రాంతానికి చెందిన గుంజా సాయితో వివాహం జరిగింది. వివాహం అయినప్పటి నుంచి అతని కుటుంబ సభ్యులు లక్ష్మిని శారీరరకంగా, మానసికంగా చిత్రహింసలు పెట్టడంతో ఇంట్లో ఎవరు లేని సమయాన ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురు చావుకు సాయి, అతని కుటుంబసభ్యులే కారణం అని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రిని కలిసిన ఏఎన్ఎం



మంత్రి హరీశ్‌రావుతో ఏఎన్ఎం

అన్నపురెడ్డిపల్లి: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును మండల పరిధిలోని మద్దుకూరు ఏఎన్ఎం తేజావత్ సుశీల మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎన్ఎం ఇటీవల జాతీయ స్థాయిలో ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న సందర్భంగా మంత్రిని హైదరాబాద్‌లో కలిశారు. గిరిజనులకు ఆమె అందించిన వైద్య సేవలను గురించి మంత్రికి వివరించగా.. సేవలను మరింతగా విస్తరించాలని ఆమెకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో ప్రైవేట్ డ్రైవర్ల సమ్మె

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి భూనిర్వాసితులు, ఎక్స్ ఎంప్లాయిస్ సన్స్ వెహికిల్స్ ఓనర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ వాహనాల యజమానులు, డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ గురువారం నుంచి సమ్మెకు దిగారు. సింగరేణి వ్యాప్తంగా వివిధ విభాగాల్లో సుమారు 1200 వాహనాలను ఆయా యజమానులు ఒప్పందంపై నడుపుతున్నారు. వారి సమస్యలపై ఈనెల 4న సింగరేణి కార్పొరేట్ జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) బి.హనుమంతరావు సమక్షంలో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా డ్రైవర్లు, ఓనర్లు ప్రస్తుత మార్కెట్ ప్రకారం డ్రైవర్ వేతనం పెంచాలని, వాహనాల అద్దె పెంచాలని కోరా రు. దీనికి స్పందించిన యాజమాన్యం ఆ అంశాలను టెండర్లలో పొందుపరిచామని, ఇంకేమైనా ఉంటే ఉన్నతాధికారులతో చర్చించి వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చింది. అయినప్పటికీ డ్రైవర్లు సమ్మెకు దిగారు. కాగా, దీనిపై పర్సనల్ జీఎం హనుమంతరావు మాట్లాడుతూ.. ఈనెల 4న డ్రైవర్లు, ఓనర్లతో చర్చించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చామని, ఇంకేమైనా సమస్యలు ఉంటే మరోసారి చర్చించుకోవాలని సూచించారు. అంతే తప్ప సమ్మెకు దిగడం సరైంది కాదన్నారు.